RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి: 4 సంచిక:132

ఆదివారం
మే 17, 2026

పేజీలు 8
వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260



## పోలీసుల ఎదుట లొంగిపోయిన బండి భగీరథ్

- కొడుకును పోలీసులకు అప్పగించిన బండి సంజయ్
- చట్టానికి అందరూ సమానమేనన్న కేంద్ర మంత్రి
- విచారణకు పూర్తి సహకారం అందిస్తామని స్పష్టీకరణ
- కేసులో ఆధారాలు సమర్పించినట్లు వెల్లడి

**వేద న్యూస్, హైదరాబాద్**

బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో తన కుమారుడిని న్యాయవాదుల ద్వారా పోలీసులకు అప్పగించినట్లు బండి సంజయ్ వెల్లడించారు. చట్ట ప్రకారం జరిగే విచారణకు పూర్తిగా సహకరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ చట్టం ముందు తన కుమారుడు అయినా, సామాన్య వ్యక్తి అయినా

మిగతా 2వ పేజీలో

## అంతర్రాష్ట్ర సైబర్ దోపిడీ ముఠా గుట్టురట్టు




2లో

- ఆరుగురు నిందితుల అరెస్ట్
- పదిహేను లక్షల నగదు స్వాధీనం
- ఫోన్ మోసాలపై పోలీసుల చర్యలు

## పని మనుషుల్లా వచ్చి.. ప్రాణాలు తీస్తున్రు!

### అమ్మో.. నేపాలీ గ్యాంగ్!

- వరుస దోపిడీలు, హత్యలతో అరాచకం
- హైదరాబాద్‌లో పనిమనుషుల రూపంలో మృత్యుపాశం



- ఇటీవల మాజీ ఐపీఎస్ అధికారి భార్య హత్య
- ఆ ఘటన మరువకముందే మరో ఘోరం వెలుగులోకి
- కౌకూరులో రిటైర్డ్ ప్రొఫెసర్ దంపతుల ఇంట్లో భారీ దోపిడీ
- పనికి చేరిన కేవలం 13 రోజుల్లోనే స్కెచ్
- 60 తులాల బంగారం, 15 కేజీల వెండిని ఎత్తుకెళ్లారు
- వృద్ధులు, ఒంటరిగా నివసిస్తున్న సంపన్న వర్గాలే వారి టార్గెట్
- పనిలో చేరి యజమానుల నమ్మకం సంపాదించాకే అసలు కథ
- పనిమనుషుల వివరాలను తెలపాలంటున్న పోలీసులు

2లో

**వేద న్యూస్, క్రైం బ్యూరో**

హైదరాబాద్ మహానగరాన్ని నేపాలీ ముఠాల వరుస దోపిడీలు, హత్యలు వణికిస్తున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, ఒంటరిగా నివసించే సంపన్నుల ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని పనిమనుషుల రూపంలో చొరబడుతున్న ఈ ముఠాలు, ఓనర్ల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. ఇటీవల మాజీ ఐపీఎస్ అధికారి భార్యను కిరాతకంగా చంపిన ఘటన మరువకముందే, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రిటైర్డ్ ప్రొఫెసర్ దంపతులను బంధించి దోచుకున్న ఉదంతం స్థానికంగా పెను కలకలం సృష్టిస్తోంది. కేవలం 13 రోజుల క్రితమే నమ్మకంగా పనిలో చేరి, పుట్టినరోజు వేడుకల నెపంతో ఆహారంలో మత్తుమందు ఇచ్చి ఇల్లు గుల్ల చేసిన తీరు నగరవాసులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. యజమానులు ప్రాధేయపడినా కనికరం లేకుండా కాళ్లు చేతులు కట్టేసి, ఏకంగా 60 తులాల బంగారం, 15 కేజీల వెండితో పాటు వేలాది డాలర్లను దోచుకెళ్లిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

## ఐపీఎల్ టికెట్ల పేరిట భారీ మోసాలు



- అభిమానులను టార్గెట్ చేస్తున్న కేటుగాళ్లు
- అనుమానాస్పద లింకులకు దూరంగా ఉండాలి
- నకిలీ యాప్‌లపై పోలీసుల హెచ్చరిక

2లో

## ఇందిరమ్మ ఇండ్లకు కేంద్రం నిధులు ఇవ్వకపోతే రాష్ట్రమే భరిస్తుంది

- జూన్ 2న రెండో విడత
- భూముల ధరల సవరణకు ప్రభుత్వం సిద్ధం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

2లో



## జూన్ 25 నుంచి ఓటర్ల సమగ్ర సవరణ

- ఇంటింటికీ వెళ్లనున్న బీఎల్‌వోలు
- జులైలో ముసాయిదా జాబితా విడుదల
- అక్టోబర్‌లో తుది జాబితా ప్రచురణ




**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ వచ్చే నెల నుంచి ప్రారంభం కానుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను శనివారం మీడియాకు వెల్లడించిన ఆయన, ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి సమగ్రంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. జూన్ ఇరవై ఐదు నుంచి జులై ఇరవై నాలుగు వరకు ఈ సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఈ కాలంలో అధికారులు, బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల

మిగతా 2వ పేజీలో

## పట్టి పీడిస్తున్న వడ్డీ జలగలు!

### అధిక వడ్డీలకు అప్పులు.. ఇష్టారీతిన వసూళ్లు..!

**హద్దు మీరుతున్న వడ్డీ వ్యాపారుల ఆగడాలు**

- కాజీపేట, మడికొండలో కోరలు చాస్తున్న అక్రమ వడ్డీ వ్యాపారం
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు
- వ్యాపారులకు పోలీసుల వత్తాసు..?
- ఖాకీల తీరుపై బాధితుల ఆగ్రహం
- కమిషనర్ సార్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

2లో



## ఐపీఎల్ టికెట్ల పేరిట భారీ మోసాలు

**వేద న్యూస్, హైదరాబాద్**

నగరంలో ఐపీఎల్ జోష్ రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు కూడా క్రికెట్ అభిమానులను లక్ష్యంగా చేసుకుని కొత్త తరహా మోసాలకు తెర లేపారు. ఈ నెల ఇరవై రెండో తేదీన ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనున్న హైదరాబాద్ జట్టు, బెంగళూరు జట్టు మధ్య మ్యాచ్‌పై అభిమానుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. ఈ ఉత్సాహాన్ని ఆసరాగా చేసుకుని టికెట్ల పేరుతో మోసాలు పెరుగుతున్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రముఖ ఆటగాళ్ల ఆటను ప్రత్యక్షంగా వీక్షించాలనే ఆసక్తితో అభిమానులు టికెట్ల కోసం పోటీపడుతున్నారు. ఇదే పరిస్థితిని అవకాశంగా మార్చుకున్న సైబర్ నేరగాళ్లు నకిలీ యాప్‌లు, మోసపూరిత వెబ్‌సైట్లు సృష్టించి టికెట్ల విక్రయం పేరుతో డబ్బులు దోచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ఐపీఎల్ టికెట్లపై భారీ ప్రచారం కొనసాగుతోంది. ముఖ్యంగా ఆకర్షణీయమైన ధరలు, ప్రత్యేక ఆఫర్లు, ప్రీమియం సీట్ల పేరుతో ప్రకటనలు కనిపిస్తున్నాయి. అధికారిక టికెట్ వేదికలను పోలి ఉండేలా నకిలీ యాప్‌లు రూపొందించి ప్రజలను మభ్యపెడుతున్నట్లు గుర్తించారు. అసలు యాప్‌లను పోలి ఉండే లోగోలు, రూపకల్పనలు ఉపయోగిస్తూ తక్కువ ధరలకే ప్రత్యేక టికెట్లు అందిస్తామని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో నకిలీ లింకులు పంపించి వాటిని డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మోసాలపై నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ స్పందిస్తూ కీలక హెచ్చరికలు జారీ చేశారు. సామాజిక మాధ్యమాల్లో కనిపించే అనధికారిక టికెట్ ప్రకటనలను నమ్మవద్దని సూచించారు. అధికారికంగా కనిపించే ప్రతి యాప్ నిజమైనదే అనుకోవద్దని హెచ్చరించారు. నకిలీ లింకులను క్లిక్ చేసి టికెట్లు బుక్ చేస్తే కేవలం డబ్బులు కోల్పోవడమే కాకుండా బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారం కూడా సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లే ప్రమాదం ఉందని తెలిపారు. మ్యాచ్ చూడాలనే ఉత్సాహంతో తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. బ్లాక్ మార్కెట్ టికెట్లు, అనధికారిక ప్రకటనలు, అనుమానాస్పద సందేశాలను పూర్తిగా దూరంగా ఉంచాలని సూచించారు.

## సైబర్ దోపిడీ ముఠా గుట్టురట్టు

**వేద న్యూస్, హైదరాబాద్**

సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతున్న సైబరాబాద్ పోలీసులు మరో కీలక విజయాన్ని నమోదు చేశారు. అంతర్రాష్ట్ర స్థాయిలో పనిచేస్తున్న వ్యవస్థీకృత సైబర్ మోసాల ముఠాను సైబర్ క్రైమ్ విభాగం ఛేదించింది. ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఫోన్ మోసాలు, సిమ్ మార్పిడి మోసాలకు పాల్పడుతున్న ముఠాపై ప్రత్యేక దర్యాప్తు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వీరు పలు రాష్ట్రాల్లో విస్తృతంగా మోసాలకు పాల్పడుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. ముఖ్యంగా ఫోన్ కాల్స్ ద్వారా ప్రజలను మోసం చేసే విధానాన్ని ఈ ముఠా అనుసరించినట్లు అధికారులు తెలిపారు. బ్యాంకు అధికారులు, సాంకేతిక సిబ్బంది పేర్లతో ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు సేకరించి మోసాలకు పాల్పడినట్లు గుర్తించారు. అలాగే సిమ్ మార్పిడి విధానాన్ని ఉపయోగించి బాధితుల మొబైల్ నంబర్లను తమ ఆధీనంలోకి తీసుకుని బ్యాంకు ఖాతాలపై నియంత్రణ సాధించినట్లు పోలీసులు తెలిపారు. ఈ పద్ధతి ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహించి డబ్బులను అక్రమంగా కాజేసినట్లు అనుమానిస్తున్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు పదిహేను లక్షల రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదనంగా మరిన్ని ఆధారాలు, సాంకేతిక పరికరాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ ముఠాకు ఇతర రాష్ట్రాలతో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మోసాల పరిమాణం మరింత విస్తృతంగా ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. అపరిచితుల ఫోన్ కాల్స్, వ్యక్తిగత సమాచారం అడిగే వ్యక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ పోలీసులు సూచించారు. బ్యాంకు వివరాలు, రహస్య సంఖ్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు.

## జూన్ 25 నుంచి ఓటర్ల సమగ్ర సవరణ

**మొదటి పేజీ తరువాయి**

వివరాలను ధృవీకరించే ప్రక్రియ చేపడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి బూత్ స్థాయి అధికారులు వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని తెలిపారు. ప్రతి ఓటరుకు రెండు ఫారాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వాటిలో ఒక ఫారాన్ని పూర్తిగా నింపి తిరిగి బీఎల్‌వోలకు అందజేయాల్సి ఉంటుందని వివరించారు. మరో ఫారాన్ని ఓటర్లు రసీదు రూపంలో తమ వద్ద ఉంచుకోవచ్చని తెలిపారు. ఈ విధానం ద్వారా సమాచారం సమగ్రంగా నమోదు కావడంతో పాటు భవిష్యత్ అవసరాలకు కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. సాంకేతిక సదుపాయాలను దృష్టిలో ఉంచుకుని ఆన్‌లైన్ విధానాన్ని కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఎన్యుమరేషన్ ఫారాల ఆధారంగా జులై ముప్పై ఒకటో తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ జాబితాను రాజకీయ పార్టీలకు అందజేయడంతో పాటు అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ముసాయిదా జాబితాపై ప్రజలు, రాజకీయ పార్టీలు తమ అభ్యంతరాలు లేదా సూచనలు తెలియజేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. జులై ముప్పై ఒకటి నుంచి ఆగస్టు ముప్పై వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదులను పూర్తిగా పరిశీలించిన తర్వాత అక్టోబర్ ఒకటో తేదీన తుది ఓటర్ల జాబితా అధికారికంగా విడుదల చేస్తామని తెలిపారు.

## కేంద్రం ఇవ్వకపోతే రాష్ట్రమే భరిస్తుంది

**వేద న్యూస్, హైదరాబాద్**

రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధుల కోసం రాష్ట్రం ఎదురుచూస్తోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కేంద్రం నుంచి రావాల్సిన వాటా నిధులు ఆలస్యమైనప్పటికీ లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. శనివారం తన ఛాంబర్‌లో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మాట్లాడిన మంత్రి, ఈ ఏడాది మార్చి నెల నుంచి కేంద్ర నిధుల కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. ఒక్కో ఇంటికి కేంద్రం వాటాగా సుమారు లక్షా పదమూడు వేల రూపాయలు విడుదల కావాల్సి ఉందన్నారు. కేంద్రం నుంచి నిధులు వస్తాయనే ఆశతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఫైనల్ బిల్లుల చెల్లింపును తాత్కాలికంగా నిలిపినట్లు వివరించారు. అయితే మరో 15 నుంచి 20 రోజుల్లోగా నిధులు విడుదల కాకపోతే రాష్ట్ర ప్రభుత్వమే ఆ మొత్తాన్ని భరించి లబ్ధిదారులకు నేరుగా అందజేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొదటి విడతలో మూడున్నర లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు సుమారు లక్షా ముప్పై రెండు వేల ఇండ్ల నిర్మాణం పూర్తయిందని, జూన్ నెలాఖరుకు మరో 68 నుంచి 72 వేల ఇండ్ల శ్లాబ్ నిర్మాణం పూర్తవుతుందని వెల్లడించారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తారని తెలిపారు.

# పట్టి పీడిస్తున్న వడ్డీ జలగలు

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**




**అధిక వడ్డీలకు అప్పులు.. ఇష్టారీతిన వసూళ్లు..!**

- హద్దు మీరుతున్న వడ్డీ వ్యాపారుల ఆగడాలు
- కాజీపేట, మడికొండలో కోరలు చాస్తున్న అక్రమ వడ్డీ వ్యాపారం
- పోలీసులను ఆశ్రయిస్తున్న భాధితులు
- వ్యాపారులకు పోలీసుల వత్తాసు..?
- ఖాకీల తీరుపై బాధితుల ఆగ్రహం
- కమిషనర్ సార్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

గ్రేటర్ వరంగల్ కాజీపేట,మడికొండ ప్రాంతాల్లో అక్రమ వడ్డీ వ్యాపారం రోజు రోజుకూ విస్తరిస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో డబ్బులు తీసుకున్న పేద,మధ్యతరగతి కుటుంబాలను కొంతమంది వడ్డీ వ్యాపారులు మానసికంగా,ఆర్థికంగా వేధిస్తున్నారని భాధితులు ఆరోపిస్తున్నారు. అధిక వడ్డీల పేరుతో కుటుంబాలను రోడ్డున పడేస్తూ భయాందోళనలకు గురి చేస్తున్న ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. మడికొండ ప్రాంతంలో కొందరు వడ్డీ వ్యాపారులు రూ.10 నుంచి రూ.15 శాతం వరకు అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని బాధితులు వెల్లడిస్తున్నారు. అప్పు తీసుకునే సమయంలో మధురంగా మాట్లాడే వ్యాపారులు తిరిగి చెల్లింపులో స్వల్ప ఆలస్యం జరిగినా అమానుషంగా ప్రవర్తిస్తున్నారని వాపోతున్నారు. "డబ్బులు కడతావా.. లేక చస్తావా" అంటూ నేరుగా బెదిరింపులకు దిగుతున్నారని బాధిత కుటుంబాలు చెబుతున్నాయి. కొంతమంది వ్యాపారులు కొంతమంది యువకులకు మద్యం తాగించి వెంటబెట్టుకొని బాధితుల ఇళ్లపైకి వెళ్లి గొడవలు సృష్టిస్తున్నారు. ఇంట్లో ఉన్న మహిళలు,వృద్ధులు,చిన్నపిల్లలను సైతం భయపెడుతూ అవమానకరంగా మాట్లాడుతున్నారని భాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పు తీసుకున్న వారి కుటుంబ సభ్యులపై కూడా ఒత్తిడి తెచ్చి,సామాజికంగా అవమానించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఒకరు ఊరు విడిస్తే.. మరొకరు ఆత్మహత్యాయత్నం..!?**

మడికొండకు చెందిన ఒక ఆటో డ్రైవర్ సుమారు 6సంవత్సరాల క్రితం ఒక వడ్డీ వ్యాపారి నుండి రూ.1లక్ష 50వేలు అధిక వడ్డీతో అప్పు తీసుకోగా 5సంవత్సరాలు కేవలం వడ్డీ మాత్రమే రూ.4లక్షల 50వేలు కట్టగా ఒక సంవత్సరం నుండి వడ్డీ చెల్లించకపోవడంతో వడ్డీ కోసం భాధితుడి ఇంటి పైకి వ్యాపారి కొంతమందిని తీసుకుపోయి బెదిరింపులకు గురిచేయగా భయపడిన ఆటో డ్రైవర్ మానసిక ఒత్తిడికి గురై ఊరు వదిలి కుటుంబంతో కలిసి గోపాలపురంలో కిరాయికి ఉంటున్నాడు. అది తెలుసుకున్న వ్యాపారి ఆటో డ్రైవర్ ఇంట్లో లేని సమయంలో అతని ఇంటికి వెళ్లి భార్యతో అమర్యాదగా మాట్లాడినట్టు భాధితుడు వాపోయాడు. ఈ వ్యవహారంపై బాధితుడు కరీంనగర్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఒక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినప్పటికీ న్యాయం జరగలేదని ఆరోపిస్తున్నారు. చివరకు పోలీసులు వడ్డీ వ్యాపారులకే మద్దతుగా వ్యవహరించడంతో పాటు బాధితులు ఇంకా వడ్డీ వ్యాపారికే అప్పు ఉన్నట్లు కాగితాలు రాయించనట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరొక ఘటనలో ఇటీవల ఓ బాధితుడు వడ్డీ వ్యాపారి వేధింపులు భరించలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తెలిసింది. ఐదు రోజులు ఎంజీఎంలో చికిత్స పొంది ఇంటికి రాగా ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉండడంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. వడ్డీ వ్యాపారుల నుండి తమకు ప్రాణహాని ఉందని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. ఇలా వడ్డీ వ్యాపారులపై పోలీసులకు ఫిర్యాదులు చేసినప్పటికీ కేసులు నమోదు చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని భాధితులకు విమర్శిస్తున్నారు. స్థానిక ప్రజలు చెబుతున్న వివరాల ప్రకారం కాజీపేట,మడికొండ ప్రాంతాల్లో అక్రమ వడ్డీ వ్యాపారం గుట్టుచప్పుడు కాకుండా విస్తరిస్తోందని, రోజువారీ కూలీలు,చిన్న వ్యాపారులు,ఆటో డ్రైవర్లు,ప్రైవేట్ ఉద్యోగులు ఎక్కువగా ఈ వలలో చిక్కుకుంటున్నారని తెలుస్తోంది. అత్యవసర అవసరాల కోసం తీసుకున్న చిన్న మొత్తాల అప్పులు, అధిక వడ్డీల కారణంగా భారీ భారంగా మారుతున్నాయని బాధితులు చెబుతున్నారు.

**వడ్డీ వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలి**

అక్రమ వడ్డీ వ్యాపారులపై వరంగల్ పోలీస్ కమిషనర్ వెంటనే ప్రత్యేక దృష్టి సారించి ఉక్కుపాదం మోపాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. వడ్డీ పేరుతో ప్రజలను వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బందిపై కూడా శాఖాపరమైన విచారణ జరిపించాలని కోరుతున్నారు. బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించి అక్రమ వడ్డీ వ్యాపారాన్ని పూర్తిగా అరికట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పోలీసుల ఎదుట లొంగిపోయిన భగీరథ్

**మొదటి పేజీ తరువాయి**

అందరూ సమానమేనని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థపై తనకు ఉన్న గౌరవంతోనే భగీరథ్‌ను విచారణ కోసం అప్పగించామని చెప్పారు. దేశంలో ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. వ్యక్తిగత సంబంధాల కంటే చట్టం గొప్పదనే భావనతోనే తాము వ్యవహరిస్తున్నామని తెలిపారు. తన కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని పదేపదే చెబుతున్నాడని బండి సంజయ్ వెల్లడించారు. కేసుకు సంబంధించిన ఆధారాలను కూడా న్యాయవాదుల ద్వారా పోలీసులకు అందజేసినట్లు పేర్కొన్నారు. వాస్తవానికి ఫిర్యాదు వచ్చిన తొలి రోజుల్లోనే భగీరథ్‌ను పోలీసులకు అప్పగించాలని భావించినట్లు తెలిపారు. అయితే కేసుకు సంబంధించిన కొన్ని ఆధారాలను సమర్పించాల్సిన అవసరం ఉండటంతో కొంత ఆలస్యం జరిగిందని వివరించారు. ఇక ఆలస్యం చేయడం సమంజసం కాదని భావించి చట్టపరమైన ప్రక్రియలో భాగంగా కుమారుడిని పోలీసులకు అప్పగించినట్లు వెల్లడించారు. సమర్పించిన ఆధారాలను పోలీసులు పరిశీలించిన తర్వాత నిజానిజాలు బయటకు వస్తాయని, కేసు కొట్టివేయబడుతుందని న్యాయవాదులు చెప్పినట్లు బండి సంజయ్ తెలిపారు. బెయిల్ కూడా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మైనర్ బాలిక కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బండి భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోంది.

# పని మనుషుల్లా వచ్చి.. ప్రాణాలు తీస్తున్రు!

**అమ్మో.. నేపాలీ గ్యాంగ్!**

**వరుస దోపిడీలు, హత్యలతో అరాచకం**

**హైదరాబాద్‌లో పనిమనుషుల రూపంలో మృత్యుపాశం**

- ఇటీవల మాజీ ఐపీఎస్ అధికారి భార్య హత్య
- ఆ ఘటన మరువకముందే మరో ఘోరం వెలుగులోకి
- కౌకూరులో రిటైర్డ్ ప్రొఫెసర్ దంపతుల ఇంట్లో భారీ దోపిడీ
- పనికి చేరిన కేవలం 13 రోజుల్లోనే స్కెచ్
- 60 తులాల బంగారం, 15 కేజీల వెండిని ఎత్తుకెళ్లారు
- వృద్ధులు, ఒంటరిగా నివసిస్తున్న సంపన్న వర్గాలే వారి టార్గెట్
- పనిలో చేరి యజమానుల నమ్మకం సంపాదించాకే అసలు కథ
- పనిమనుషుల వివరాలను తెలపాలంటున్న పోలీసులు

**వేద న్యూస్, క్రైం బ్యూరో**

హైదరాబాద్ మహానగరంలో నేపాలీ గ్యాంగ్‌లు వరుస దోపిడీలు, హత్యలతో సామాన్య ప్రజలను, ముఖ్యంగా వృద్ధ దంపతులను వణికిస్తున్నాయి. పనిమనుషుల రూపంలో ఇంట్లోకి ప్రవేశించి, యజమానుల నమ్మకాన్ని పొంది, ఆపై అదును చూసి ఆ ఇళ్లకే కన్నాలు వేస్తున్న ఈ ముఠాల అరాచకాలు నగరవాసుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. ఇటీవల ఒక మాజీ ఐపీఎస్ అధికారి భార్యను అతి కిరాతకంగా హత్య చేసిన ఉదంతం మరువకముందే, తాజాగా జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో రిటైర్డ్ ప్రొఫెసర్ దంపతులను బంధించి దోచుకున్న ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.



**నమ్మితే అంతే సంగతులు..**

హైదరాబాద్ నగరంలోని సంపన్న ప్రాంతాల్లో నివసిస్తున్న వృద్ధులు, ఒంటరిగా ఉంటున్న వారే ఈ నేపాలీ ముఠాల ప్రధాన లక్ష్యంగా మారుతున్నారు. ఈ ముఠాలు నేరుగా దాడులకు దిగకుండా, అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తాయి. మొదట పనిమనుషులుగా తక్కువ జీతానికే చేరి, యజమానులతో నమ్మకంగా మెలుగుతూ వారి దైనందిన అలవాట్లు, ఇంట్లో ఉన్న నగలు, నగదు, బీరువాల తాళాల వివరాలన్నీ నిశితంగా గమనిస్తాయి. కౌకూరులోని గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్న రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీధర్ మోహన్(68), ఆయన భార్య డాక్టర్ విజయలక్ష్మి (58) ఇంట్లో కూడా ఇదే తరహాలో ఒక నేపాలీ జంట కేవలం 13 రోజుల క్రితమే పనిలో చేరింది. పనిలో చేరిన పక్షం రోజులు కాకముందే యజమానుల వద్ద భారీగా ఆస్తి ఉన్నట్లు గుర్తించి, వారిని దోచుకోవాలని నిర్ణయించుకున్నాయి.

**వేడుక పేరుతో మత్తు మందు..**

ఈ ముఠాలు తమ పథకాన్ని అమలు చేయడానికి పుట్టినరోజు వేడుకలను ఒక ఆయుధంగా వాడుకున్నాయి. పథకంలో భాగంగా నేపాల్‌కు చెందిన మరో మహిళను తమ బంధువు పేరుతో ఇంటికి పిలిపించి, ఆమె పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటామని యజమానుల అనుమతి కోరారు. వారిని నమ్మిన ప్రొఫెసర్ దంపతులు అంగీకరించడంతో, సోమవారం ఉదయం కేక్ కోసి అందులో మత్తు మందు కలిపి యజమానులకు ఇచ్చారు. ఆ కేక్ తిన్న కాసేపటికే దంపతులు మత్తులోకి జారుకుంటుండగా, తమపై దోపిడీ జరుగుతోందని గుర్తించి 'మీకు కావాల్సింది తీసుకెళ్లండి.. కానీ మమ్మల్ని మాత్రం చంపకండి' అని నిందితులను వేడుకున్నారు. అయినా కనికరం చూపని ఆ ముఠా, దంపతుల కాళ్లు చేతులు తాళ్లతో కట్టేసి ఒక గదిలో బంధించి బీరువాలు, అల్మారాలు పగలగొట్టి బీభత్సం సృష్టించాయి.

**60 తులాల బంగారం మాయం**

నిర్దాక్షిణ్యంగా వ్యవహరించిన ఈ ముఠా ఇంట్లో ఉన్న విలువైన వస్తువులన్నింటినీ సర్దేశాయి. సుమారు 60 తులాల బంగారు ఆభరణాలు, 15 కేజీల వెండి, 30 వేల రూపాయల నగదు మరియు 3 వేల డాలర్లను దోచుకుని ఇంటికి తాళాలు వేసి పరారయ్యారు. సోమవారం నుంచి మంగళవారం సాయంత్రం వరకు బాధితులు మత్తులోనే ఉండిపోయారు. మత్తు దిగిన తర్వాత మురళీమోహన్ గట్టిగా కేకలు వేయడంతో గమనించిన స్థానికులు వచ్చి తలుపులు పగలగొట్టి వారిని రక్షించడంతో ఈ అరాచకం వెలుగులోకి వచ్చింది. ఈ దోపిడీలో మొత్తం ఐదు నుంచి ఏడుగురు వ్యక్తులు పాల్గొన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

**రెచ్చిపోతున్న ముఠాలు..**

నగరంలో వరుసగా జరుగుతున్న ఈ సంఘటనలు శాంతిభద్రతలపై ఆందోళన కలిగిస్తున్నాయి. ముఠా సభ్యులు తమ అవసరానికి ఎంతకైనా తెగించే తత్వాన్ని కలిగి ఉన్నారని, అవసరమైతే హత్యలు చేయడానికి కూడా వెనకాడరని గత సంఘటనలు రుజువు చేస్తున్నాయి. ఈ కేసును అత్యంత సీరియస్‌గా తీసుకున్న పోలీసులు, నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మల్కాజిగిరి డీసీపీ ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పనిమనుషులను ఇంట్లో చేర్చుకునేటప్పుడు యజమానులు అప్రమత్తంగా ఉండాలని, వారి పూర్తి వివరాలను సమీప పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయాలని అధికారులు పదే పదే హెచ్చరిస్తున్నారు.

## గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా వినోద్ గౌడ్

**వేద న్యూస్, వీర్నపల్లి :**



రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా భూత వినోద్ గౌడ్‌ను జిల్లా మోకుదెబ్బ గౌడ సంఘం అధ్యక్షులు లచ్చులగారి శ్రీనివాస్ గౌడ్ నియమించారు. ఈ సందర్భంగా భూత వినోద్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గౌడ సంఘ సమస్యల పరిష్కారం కోసం సంఘ సభ్యులతో కలిసి నిరంతరం పోరాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సంఘ ఐక్యతను బలోపేతం చేసి గౌడుల హక్కుల సాధన కోసం కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు. స్థానిక సంఘ నాయకులు, సభ్యులు భూత వినోద్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన నాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## ఉద్యమకారుల సహనాన్ని పరీక్షించొద్దు

**- డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమం తప్పదు**
**- మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్**

**వేద న్యూస్, మహబూబాబాద్:**



తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు పేరుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలు కాలయాపన కోసమేనని మహబూబాబాద్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్ విమర్శించారు. ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు 500 గజాల ఇళ్ల స్థలం, నెలకు రూ.25 వేల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఉద్యమ సమయంలో నమోదైన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. జూన్ 2లోగా డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమ స్ఫూర్తితో మరో ప్రజా పోరాటం చేపడతామని హెచ్చరించారు.

## ఆర్టీఐ అమలులో అధికారుల నిర్లక్ష్యం

**- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సమాచార కమిషనర్‌కు ఫిర్యాదు**

**వేద న్యూస్, జగిత్యాల :**



రాష్ట్ర సమాచార కమిషనర్లు శనివారం జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన, ఫిర్యాదుల విచారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఐ దరఖాస్తుదారుడు మేకల అక్షయ్ కుమార్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.వి. శ్రీనివాస్ రావును కలిసి ఫిర్యాదు చేశారు. జగిత్యాల జిల్లా పంచాయతీ అధికారులు సమాచార హక్కు చట్టం ప్రకారం కోరిన సమాచారాన్ని అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాలను కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. మద్దునూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన బోర్డు కూడా ఏర్పాటు చేయలేదని తెలిపారు. సమాచార హక్కు చట్టం అమలులో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత పీఐవోలు, ప్రథమ అప్పీలేట్ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సమాచార కమిషనర్‌ను కోరారు.

## మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

**వేద న్యూస్, పెగడపల్లి :**



**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం సుద్దపల్లి, దోమలకుంట గ్రామాల్లో మహిళా సంఘాల వీఓ భవన నిర్మాణాలకు శనివారం ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పనిచేస్తోందని కొనియాడారు. "మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికంగా స్థిరపడాలనే ఉద్దేశంతో 'మహిళా శక్తి' పథకం ద్వారా పెద్ద ఎత్తున రుణాలు అందిస్తున్నాం. వారి ఎదుగుదలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. సుద్దపల్లి గ్రామం: రూ. 20 లక్షల అంచనా వ్యయంతో వీఓ భవన నిర్మాణం. దోమలకుంట గ్రామం: రూ. 10 లక్షల అంచనా వ్యయంతో వీఓ భవన నిర్మాణం. భవిష్యత్ ప్రణాళిక: రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మహిళా సంఘాల కోసం సొంత వీఓ భవనాలను నిర్మిస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'పెట్రో' ధరలు తగ్గించాలి

**- ఆటోను తాడుతో లాగి సీపీఐ నిరసన**

**వేద న్యూస్, కోటగిరి :**



కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కోటగిరి బస్టాండ్ వద్ద శనివారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆటోను తాడుతో లాగుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, మండల కార్యదర్శి ఏ. విటల్ గౌడ్ మాట్లాడుతూ.. ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో ధరలు పెంచకుండా ఉంచి, ప్రస్తుతం పెంచడం ప్రజలపై భారమని విమర్శించారు. గ్యాస్ ధరలు భారీగా పెరగడంతో ప్రజలు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెట్రోల్, డీజిల్‌పై జీఎస్టీని ఎత్తివేస్తేనే ధరలు తగ్గుతాయని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నల్ల గంగాధర్, నీలి శంకర్, కే రాజు, రాములు, హనుమాన్లు, అన్సార్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## హెటిరో ల్యాబ్స్‌తో ప్రభుత్వ సిటీ కాలేజి అవగాహన ఒప్పందం

**- విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్, పరిశ్రమ శిక్షణకు అవకాశం**

**వేద న్యూస్, హైదరాబాద్ :**



ప్రభుత్వ సిటీ కాలేజి కెమిస్ట్రీ విభాగం, ఫార్మాస్యూటికల్ మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ క్వాలిటీ విభాగం ప్రముఖ ఫార్మా సంస్థ హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్‌తో పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్య కార్యక్రమాన్ని ప్రారంభించింది. విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్, ఇండస్ట్రియల్ పర్యటనలు, పరిశోధన ఆధారిత శిక్షణ అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. పి. శాంతి ఆధ్వర్యంలో కెమిస్ట్రీ విభాగ అధ్యాపక బృందం, హెటిరో సంస్థ హెచ్‌ఆర్ అధికారులు విజయ్, సంతోష్ విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. సిహెచ్. ప్రసాద్, హెటిరో ప్రతినిధులు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్రీ విభాగాధిపతి డా. బి. జ్యోతి, డా. బి. రజిత, అనిల్ బూసి, అనూష పాల్గొన్నారు. ఫార్మా రంగ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

## సిటీ కాలేజీలో ప్రతిభావంతులకు సత్కారం

**వేద న్యూస్, హైదరాబాద్ :**




తెలంగాణ ప్రభుత్వ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ సిటీ కళాశాలలో శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల అభినందన, సాంకేతిక ప్రగతి, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో కార్యక్రమాలు చేపట్టారు. సామాజిక శాస్త్రాల విభాగాల ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించిన పూర్వ విద్యార్థులను సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్. ప్రసాద్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ శాంతి, డాక్టర్ రాజేంద్ర కుమార్‌తో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొని విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఇదే సందర్భంగా కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జెనరేటివ్ ఏఐపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. పి. శాంతి కార్యక్రమాన్ని ప్రారంభించగా, రే బిజినెస్ టెక్నాలజీస్‌కు చెందిన శ్రీనివాస్ వెల్దండి కృత్రిమ మేధ వినియోగం, ఆధునిక బోధన, పరిశోధన రంగాల్లో దాని ప్రాధాన్యతపై వివరించారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా. పి. నాగేశ్వర్ వక్తను సభకు పరిచయం చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని ఏఐ సాంకేతికతపై అవగాహన పెంపొందించుకున్నారు.

## ధర్మపురి 10వ వార్డులో నీటి కొరతకు శాశ్వత పరిష్కారం

**- నూతన త్రాగునీటి పైప్‌లైన్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి**

**వేద న్యూస్, ధర్మపురి :**



ధర్మపురి పట్టణంలోని 10వ వార్డు ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. గత కొంతకాలంగా వార్డులో నెలకొన్న త్రాగునీటి కొరత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నూతన త్రాగునీటి పైప్‌లైన్‌ను శనివారం ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి వేముల నాగలక్ష్మి గారు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యంగా వేసవి కాలంలో ప్రజలు త్రాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా వార్డుల వారీగా ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. "10వ వార్డులో నీటి సమస్య తీవ్రతను గుర్తించి, తాత్కాలిక ఏర్పాట్లకు పోకుండా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారంగా ఈ నూతన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశాం. ఈ పనుల ద్వారా వార్డులోని ప్రతి ఇంటికీ ఇకపై తగినంత త్రాగునీరు అందుబాటులోకి వస్తుంది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ సంగనబట్ల దినేష్, స్థానిక 10వ వార్డు కౌన్సిలర్ సంగి ఆనంద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వార్డులో నీటి సమస్యను పరిష్కరించేందుకు చైర్‌పర్సన్, కౌన్సిలర్ ప్రత్యేక చొరవ చూపడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేద న్యూస్

ఆదివారం మే 17, 2026

# వడ్ల కొనుగోలును తక్షణమే వేగవంతం చేయాలి

**– జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్**



**వేద న్యూస్, జగిత్యాల/రూరల్ :**

రైతులు కొనుగోలు కేంద్రాలకు వడ్లు తెచ్చి దాదాపు నెల రోజులు గడుస్తున్నా, ప్రభుత్వం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చేస్తోందని జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ మండిపడ్డారు. శనివారం చల్గల్ గ్రామంలోని మార్కెట్ యార్డ్‌ను సందర్శించిన ఆమె, అక్కడ రైతులు పోసిన వడ్ల కుప్పలను పరిశీలించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దావ వసంత సురేష్ మాట్లాడుతూ.. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ఈ ఏడాది రుతుపవనాలు ముందస్తుగానే వచ్చే అవకాశం ఉందని, అకాల వర్షాలు కురిస్తే అన్నదాతలు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు (సంచులు), వడ్లు తరలించడానికి లారీల కొరత తీవ్రంగా ఉందని రైతులు వాపోతున్నారు. ప్రణాళిక లోపించింది: జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఒక ప్రణాళికాబద్ధంగా కొనుగోలు సెంటర్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలి. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు నాయకుడు కేసీఆర్ గారి నేతృత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసిన ఘనత ఉందన్నారు. గత ప్రభుత్వంలో కొనుగోళ్లు ఎంత వేగంగా, సజావుగా సాగాయో.. ఇప్పుడు కూడా అదే విధంగా జరగాలని డిమాండ్ చేశారు. నాడు కేసీఆర్ గారు నీటి కష్టాలు, కరెంటు కష్టాలు తొలగించి, 24 గంటల ఉచిత కరెంటు ఇవ్వడమే కాకుండా.. కాళేశ్వరం లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు కట్టి అన్నదాతలను ఆదుకున్నారని గుర్తుచేశారు. ఆనాడు తీసుకున్న నిర్ణయాల వల్లే భూమికి భారమయ్యేంత పంట తెలంగాణ గడ్డపై పండుతోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు వెంకటేశ్వర్ రావు, శీలం ప్రవీణ్, ఎల్లా రాజన్న, ముత్యం రమేష్, వెంకటేష్, యోహన్, కిషోర్ మరియు పెద్ద సంఖ్యలో రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లకు ఎస్‌హెచ్‌వో కౌన్సెలింగ్

**– నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**



**వేద న్యూస్, కాజీపేట:**

కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు శనివారం ఎస్‌హెచ్‌వో శ్యాంసుందర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. కాజీపేట పట్టణ పరిధిలో ఎటువంటి సివిల్ వివాదాలు, క్రిమినల్ కార్యకలాపాలకు పాల్పడవద్దని కఠినంగా హెచ్చరించారు. భవిష్యత్తులో ఇటువంటి కేసుల్లో పాల్గొన్నట్లు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజల్లో శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని సూచించారు.

# పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**– మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**వేద న్యూస్, ఎండపల్లి :**

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కొత్త, పాత అనే తేడా లేకుండా ప్రతి ఒక్క కార్యకర్త నిబద్ధతతో కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన గెల్లు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో.. మండలంలోని రాజారాం పల్లి గ్రామంలో ఘనంగా అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు మండలంలోని అన్ని గ్రామాల కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య సూచనలు పథకాల ప్రచారం పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. కలిసికట్టుగా ముందడుగు గతంలో పార్టీ కోసం పనిచేసిన సీనియర్ నాయకులను, కార్యకర్తలను ఎట్టిపరిస్థితుల్లోనూ విస్మరించకూడదు. అందరినీ కలుపుకొని పోతూ పార్టీ నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలి రాబోయే ఎన్నికలే లక్ష్యం రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విజయతీరాలకు చేర్చడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో కష్టపడాలన్నారు. ఈ అభినందన సభలో నూతన అధ్యక్షుడిని మంత్రి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, పాత-కొత్త కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టెన్త్ ఆణిముత్యాలకు నగదు అందజేత



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఆమనగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. వేములపల్లి మండల పరిధిలోని ఈ పాఠశాలకు చెందిన మున్న మహేశ్వరి 537 మార్కులు, ఆదిమల్ల శ్రీజ 535 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి జన్మదిన సందర్భంగా ఆయన కుమారుడు విద్యార్థులకు ప్రోత్సాహకంగా మున్న మహేశ్వరికి రూ. 12 వేల, ఆదిమల్ల శ్రీజకు రూ. 10 వేల నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు యోగీశ్వర్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# పాగుంటలో తాగునీటి కోసం తిప్పలు..!

- సుమారు 70 కుటుంబాలకు నీటి కష్టాలు
- బావుల చుట్టూ తిరుగుతున్న కాలనీవాసులు
- హామీలకే పరిమితమైన పాలకులు..!



**వేద న్యూస్, గద్వాల్ ప్రతినిధి :**

జోగులాంబ గద్వాల జిల్లా,కేటీదొడ్డి మండలంలోని పాగుంట గ్రామంలో తాగునీటి సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. గ్రామంలోని ఓ కాలనీలో దాదాపు 70 కుటుంబాలు నివాసముంటుండగా, వారికి సరిపడా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చుక్కనీరు కోసం కాలనీవాసులు పొలాల వెంట ఉన్న బావుల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామంలో తాగునీటి కష్టాలు తీవ్రంగా ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కారంపై దృష్టి సారించడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన పాలకులు కనీస అవసరమైన తాగునీటిని కూడా అందించలేకపోతున్నారని మండిపడుతున్నారు. నాటి ప్రభుత్వం నుంచి నేటి ప్రభుత్వం వరకు పాలకులు మారినా గ్రామంలో తాగునీటి సమస్య మాత్రం పరిష్కారం కాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి పాగుంట గ్రామానికి శాశ్వత తాగునీటి సదుపాయం కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోండి

**– డెంగ్యూ వ్యాధిని అంతం చేయండి : వైద్యాధికారి సంపత్ కుమార్**

**వేద న్యూస్, బ్రహ్మంగారిమఠం :**

దోమలను నివారించి డెంగ్యూ వ్యాధిని అంతం చేయాలని బి.మఠం వైద్యాధికారి సంపత్ కుమార్ అన్నారు. శనివారం జాతీయ డెంగ్యూ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా బి.మఠం పీహెచ్సీ వైద్య సిబ్బంది బ్యానర్లు చేతపట్టి దోమ పుట్టకూడదు- కుట్టకూడదు,పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాలి-లార్వా దశలోనే దోమలను అంతం చేయాలశీటూ నినాదాలు చేస్తూ వీధులలో ర్యాలీ,ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి సంపత్ కుమార్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఏడిస్ ఈజిప్ట్ అను దోమ వలన ఈ వ్యాధి వస్తుందన్నారు. డెంగ్యూ వ్యాధి ప్రాణాంతకరమైన వ్యాధి అని,అందువల్ల దోమ కాటుకు గురవకుండా దోమతెరలు వాడాలని ఆయన సూచించారు. అలాగే ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించి ప్రతి ఇంటిశీటీకి వెళ్లి లార్వా సర్వే నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వద్దకే వైద్యం పేరుతో 104,విలేజ్ హెల్త్ క్లినిక్,అవసరమైన చోట్ల మెడికల్ క్యాంపులను నిర్వహించి మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రమాదం జరిగిన చోటికి తక్షణమే 108 సదుపాయం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సదుపాయాలు ఉన్నాయని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు మాధవ,వెంకటరెడ్డి,ల్యాబ్ టెక్నీషియన్ రమణ కుమార్,ఫిమేల్ హెల్త్ అసిస్టెంట్లు జోష్ణ,విజయలక్ష్మి అలాగే వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేఎంసీకి 36 మంది దేహదాన హామీ

**– శరీరదానానికి ముందుకొచ్చిన దాతలు**

**– సమాజానికి స్ఫూర్తిదాయకమన్న ప్రిన్సిపాల్ సంధ్య**

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన 36 మంది తమ కుటుంబ సభ్యుల సహకారంతో మరణానంతరం శరీర దానం చేస్తామని అంగీకారం తెలుపుతూ దేహదాన హామీ పత్రాలను తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల అసోసియేషన్ ద్వారా కాకతీయ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య, అనాటమీ విభాగాధిపతి డాక్టర్ శశికాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అంగీకార శరీర దాతలను అభినందిస్తూ విల్ బాడీ డొనేషన్ సర్టిఫికెట్లను అసోసియేషన్ సభ్యులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య మాట్లాడుతూ.. దేహదాన హామీ పత్రాలు ఇవ్వడం ద్వారా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు దాతల కోరిక మేరకు మరణానంతరం శరీరదానం చేస్తారనే నమ్మకం పెరుగుతుందని, ఇది సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షులు కే. మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు పి. వేణు, అనాటమీ సిబ్బంది ప్రేమ్ కుమార్, యాదగిరి, ప్రణయ్ పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 8790548706, 9490133650 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.



# కేటీఆర్ ను కలిసిన 36వ డివిజన్ నాయకులు

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

హైదరాబాద్ లోని నంది నగర్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఆయన నివాసంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్ ఆధ్వర్యంలో 36వ డివిజన్ కి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో జిల్లా నాయకుడు మర్రి శ్రీనివాస్, 36వ డివిజన్ అధ్యక్షుడు యాకయ్య, జ్యోతి బసు నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గడల రమేష్, మైనార్టీ నాయకుడు గుల్బ ఎస్ఎస్, ఉన్నారు.



వేద న్యూస్

ఆదివారం మే 17, 2026

## పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తగ్గించాలి



### - సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిరసన

**వేద న్యూస్, దేవరకద్ర:**

పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ అమరచింతలో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. అజయ్, టి. రాఘవేంద్ర మాట్లాడుతూ.. ప్రజలు నిద్రిస్తున్న సమయంలో పెట్రోల్, డీజిల్ ధరలను రూ.3 చొప్పున పెంచడం దారుణమని విమర్శించారు. ఎన్నికల ముందు ధరలు పెంచబోమని చెప్పిన కేంద్ర మంత్రులు ఇప్పుడు స్పందించడం లేదని అన్నారు. కమర్షియల్ గ్యాస్ ధరలు భారీగా పెరగడంతో చిన్న వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గురుకులాలు, మధ్యాహ్న భోజన కేంద్రాల్లో కూడా గ్యాస్ కొరత ఏర్పడిందని ఆరోపించారు. ప్రజలు కేంద్ర ప్రభుత్వ విధానాలను గమనించి రానున్న రోజుల్లో ఉద్యమాల ద్వారా తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బుచ్చన్న, శ్యాంసుందర్, విష్ణు, సాగర్, విజయ్, రవిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## బండి సాయి భగీరథను అరెస్టు చేయాలి

### - మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

**వేద న్యూస్, దేవరకద్ర:**

మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన సాయి బండి భగీరథను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అమరచింత మండల కేంద్రంలో శనివారం సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శి ప్రసాద్, డివిజన్ నాయకులు కే. రాజన్న మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. రాజకీయ పలుకుబడి కారణంగానే నిందితుడి అరెస్టులో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వాలు ప్రజలకు రక్షణ కల్పిస్తూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బండి భగీరథను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కురుమన్న, జిలాని, భక్తి, విజయ్, తాజుద్దీన్, గీత, రామ్‌చందర్, భీమన్న, రంగన్న, శీను తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన కురుమూర్తి కొండలు

**వేద న్యూస్, చిన్నచింతకుంట :**

దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండల పరిధిలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో ఏడుకొండల మధ్య కాంచన గుహలో స్వయంభువుగా వెలసిన శ్రీ కురుమూర్తి స్వామి దర్శనానికి అమావాస్య సందర్భంగా ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు స్వామి పుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి తడి బట్టలతో క్యూలైన్లలో నిలబడి గోవింద నామస్మరణ చేస్తూ ఆలయాలను దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక మొక్కులు చెల్లించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది, పాలకవర్గం చైర్మన్ బత్తుల బాలరాజ్, పాలకమండలి సభ్యులు పర్యవేక్షణ చేపట్టి ఏర్పాట్లు చేశారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**వేద న్యూస్, పాపన్నపేట:**



జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని పోడ్చన్‌పల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల సత్యనారాయణ (55) గత కొంతకాలంగా ఫిట్స్, వెన్నునొప్పితో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటున్నాడు. శరీరం సహకరించడం లేదని తరచూ ఆవేదన వ్యక్తం చేసేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం గదిలోకి వెళ్లిన సత్యనారాయణ ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య నీరజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## డాక్టరేట్ కు ఎంపికైన ఖాజామియా

**వేద న్యూస్, మంచిర్యాల :**



బాల కార్మిక నిర్మూలన, వయోజన విద్య కోసం కృషి చేస్తున్న ఎండి ఖాజామియా యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ డాక్టర్ పురస్కారానికి ఎంపికయ్యారు. మహిళా సాధికారత కోసం డ్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం చేస్తున్న సేవలను యూనివర్సిటీ గుర్తించింది. ఈ నెల 17న చెన్నైలో యూనివర్సిటీ డాక్టర్ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ పురస్కారం ఎంపిక పట్ల ఖాజామియా హర్షం వ్యక్తం చేశారు

## రైతులకు సరిపడా గన్ని బ్యాగులు అందించాలి

### - అడిషనల్ కలెక్టర్ రవి - కొనుగోలు కేంద్రం తనిఖీ

**వేద న్యూస్, శాయంపేట :**



మండల కేంద్రంలోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని శనివారం అడిషనల్ కలెక్టర్ రవి తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా గన్ని బ్యాగులు, టార్పాలిన్లు, కాంటాలు, హమాలీలను సిద్ధంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీవో సంజీవరెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో ఫణిచంద్ర, వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, సీఈవో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటుపై హర్షం

**వేద న్యూస్, మంచిర్యాల :**



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసి, జైలు జీవితం గడిపి, ఆర్థికంగా నష్టపోయిన మలిదశ ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన 'తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక' సమావేశం హృదయపూర్వక కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలియజేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో 1200 మంది అమరవీరుల త్యాగాలను, ఉద్యమకారుల సేవలను పూర్తిగా విస్మరించిందని, కనీసం వారిని గుర్తించకుండా తీవ్ర అన్యాయం చేసిందని ఈ సందర్భంగా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే 2023 ఎన్నికల్లో ప్రజలు ఆ నాటి ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధి చెప్పారని గుర్తుచేస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల ఒత్తిడికి స్పందించి ఇచ్చిన మాట ప్రకారం ఈ కమిటీని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అయితే, గతంలోలాగా పైరవీకారులకు తావు లేకుండా క్షేత్రస్థాయిలో పోరాడిన నిజమైన ఉద్యమకారులను గుర్తించాలని కోరుతూ.. ఉద్యమకారులను స్వతంత్ర సమరయోధులుగా గుర్తించి ప్రతి నెలా రూ.50,000 పెన్షన్ ఇవ్వాలని, ప్రత్యేక గుర్తింపు కార్డులు, 250 గజాల ఇంటి స్థలంతో పాటు ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక సహాయం, 5 ఎకరాల భూమి, ఉచిత విద్యా-వైద్యం, బస్సు మరియు రైళ్లలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని, సకల జనుల సమ్మెలో పాల్గొన్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులను ఉద్యమకారులుగా గుర్తించి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని ఏకగ్రీవంగా తీర్మానించిన ఈ ప్రాముఖ్యమైన సమావేశంలో ఐక్య వేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షులు బూర్ల జ్ఞాని, కార్యదర్శి ఏ. రాజేశం, ముఖ్య ఉద్యమకారులు సిహెచ్ రామస్వామి, సత్యనారాయణ, కె. శంకరయ్య, డి. రామస్వామి, మరియు రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ తైక్వాండోలో గాదెపాడు బాలుడి ప్రతిభ




### - 8 ఏళ్ల సుధీంద్ర చేతన్‌కు రజత పతకం
### - గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన చిన్నారి

**వేద న్యూస్, కారేపల్లి :**

గద్వాల్‌లో నిర్వహించిన 16వ జాతీయ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో కారేపల్లి మండలం గాదెపాడు గ్రామానికి చెందిన 8 ఏళ్ల భూక్య సుధీంద్ర చేతన్ అద్భుత ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించాడు. సబ్ జూనియర్ యెల్లో-1 బెల్ట్ 29 కిలోల విభాగంలో పోటీపడిన చేతన్ ఫైనల్ వరకు చేరి గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చాడు. భూక్య యుగంధర్‌సుజాత దంపతుల కుమారుడైన చేతన్ హైదరాబాద్‌లోని గుట్ తైక్వాండో అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. ఈ సందర్భంగా గాదెపాడు సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ చేతన్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో పతకం సాధించడం గ్రామానికి గర్వకారణమని, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. గ్రామ పెద్దలు, యువత, మాజీ ఎంపీటీసీ సభ్యులు కూడా చేతన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## 'ఎస్ఐఆర్' సమర్థవంతంగా నిర్వహించాలి

### - జూన్ 24 నుంచి ప్రత్యేక ఓటరు సవరణ ఇంటింటి సర్వే
### - రాజకీయ పార్టీలతో ప్రతి బుధవారం సమీక్ష సమావేశాలు

**వేద న్యూస్, సూర్యాపేట :**




జూన్ 24 నుంచి జులై 25 వరకు నిర్వహించే ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో ఎస్ఐఆర్ మ్యాపింగ్ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల ద్వారా వివరాలు సేకరించాలని సూచించారు. జూన్ 15 నుంచి 22 వరకు సర్వేకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు తమ బీఎల్ఓ వివరాలు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని, వీఐపీ, వీవీఐపీ ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని, బీఎల్ఓలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, ఆర్డీవో వేణు మాధవరావు, ఎన్నికల సూపరింటెండెంట్ వాజిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## భూవివాదంతో తండాలో ఘర్షణ

**వేద న్యూస్ వరంగల్ :**

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సూర్యతండా పరిధిలోని మిత్రతండాలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. భూవివాదం నేపథ్యంలో శుక్రవారం రాత్రి రెండు వర్గాలు కర్రలు, కత్తులతో పరస్పరం దాడులు చేసుకోవడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన రమావత్ గ్యాస్య, రమావత్ రేఖ్య మధ్య కొంతకాలంగా భూమి విషయంలో వివాదం కొనసాగుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ వివాదం శుక్రవారం రాత్రి మరింత ముదిరి ఇరువర్గాలు ఎదురెదురుగా దాడులకు దిగాయి. కత్తులు, కర్రలతో జరిగిన దాడుల్లో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో రమావత్ గ్యాస్య, రమావత్ రేఖ్యతో పాటు కిరణ్, రాజేందర్, నవీన్, జీవన్ సహా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు వెంటనే వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఘర్షణకు దారితీసిన పూర్తి కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేసి సంబంధిత వ్యక్తులను విచారిస్తున్నట్లు సమాచారం

వేద న్యూస్

ఆదివారం మే 17, 2026

# సామాన్యుల ప్రాణాలు లెక్కలేవా?!





- చనిపోయినా పోస్టుమార్టం నివేదికలు ఎక్కడా?
- అనుమానాస్పద మృతుల కేసుల్లో డీఎంహెచ్‌వో విచారణేది..?
- 'వన్' హాస్పిటల్‌పై 'ఠాగూర్' తరహా ఆరోపణలు
- ప్రైవేట్ ఆసుపత్రుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- మంత్రికి లిఫ్ట్ ప్రమాదం.. మరుసటి రోజే తనిఖీలు
- పేదల ప్రాణాలంటే అంత చౌకనా..?
- కరీంనగర్‌లో కార్పొరేట్ ఆసుపత్రుల బాగోతం బట్టబయలు

**వేద న్యూస్, కరీంనగర్ :**

ప్రాణాలు కాపాడాల్సిన వైద్య రంగం కరీంనగర్ జిల్లాలో కాసులు కురిపించే వ్యాపారంగా మారిందన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య నిర్లక్ష్యం, అడ్డగోలు బిల్లులు, భద్రతా లోపాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా చోటుచేసుకున్న వరుస ఘటనలు కార్పొరేట్ ఆసుపత్రుల వ్యవహారశైలిపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. గత నెలలో కరీంనగర్‌లోని 'వన్ హాస్పిటల్'లో చోటుచేసుకున్న ఘటన 'ఠాగూర్' సినిమా తరహాలో ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేములవాడ మండలం శాత్రాజుపల్లికి చెందిన సాహెబ్ బీ (60) గుండె సంబంధిత సమస్యతో ఆసుపత్రిలో చేరగా, ఆమె మృతి చెందినప్పటికీ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఐసీయూలో ఉంచి చికిత్స పేరిట భారీ బిల్లులు వసూలు చేశారంటూ బాధితులు, ఎంఐఎం నాయకులు ఆరోపించారు. విషయం వెలుగులోకి రావడంతో ఆసుపత్రి ఎదుట నిరసనలు జరిగాయి. ఆసుపత్రిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి సీజ్ చేయాలని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రాకు ఫిర్యాదులు అందాయి. ఇదే 'వన్ హాస్పిటల్'లో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లిఫ్ట్ ప్రమాదానికి గురికావడం కలకలం రేపింది. ఓ రోగిని పరామర్శించేందుకు వెళ్లిన మంత్రి ఎక్కిన లిఫ్ట్ సాంకేతిక లోపంతో ఒక్కసారిగా కిందకు జారిపోవడంతో కొంతసేపు అందులోనే చిక్కుకుపోయారు. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆసుపత్రుల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని మండిపడ్డారు. మంత్రికి ప్రమాదం జరిగిన వెంటనే అధికార యంత్రాంగం ఆసుపత్రుల్లో భద్రతా తనిఖీలు చేపట్టడం గమనార్హం. అయితే సామాన్యులు వైద్య నిర్లక్ష్యంతో మృతి చెందిన ఘటనల్లో ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వైద్య నిర్లక్ష్యం ఆరోపణలు వచ్చిన కేసుల్లో పోస్టుమార్టం నిర్వహించకపోవడం, డీఎంహెచ్‌వో స్థాయి విచారణలు జరగకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల నగరంలోని యశోద కృష్ణ ఆసుపత్రిలో కూడా ఆపరేషన్ వికటించి ఓ మహిళ మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబం న్యాయం కోసం తిరగాల్సి వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. రోగి కుటుంబాలకు కొంత మొత్తాన్ని చెల్లించి వ్యవహారాలను ముగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లోని అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని కొందరు ఆర్ఎంపీలతో కుమ్మక్కై ప్రైవేట్ ఆసుపత్రులు కమిషన్ వ్యవస్థ నడుపుతున్నాయన్న ఆరోపణలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. చిన్న ఆరోగ్య సమస్యలకే భయపెట్టి కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తూ భారీ కమిషన్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కూడా ప్రస్తావించడం గమనార్హం. కరీంనగర్ జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రుల లైసెన్సులు రద్దు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# చీడిగ వంతెన వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు మహిళా కూలీలు మృత్యువాత
- మద్యం మత్తులో డ్రైవింగ్ వల్లే ప్రమాదమని ఆరోపణలు
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: కన్నబాబు



**వేద న్యూస్, చీడిగ :**

కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామ వంతెన వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉపాధి హామీ పనులకు వెళ్తున్న ఆరుగురు మహిళలను టిప్పర్ లారీ ఢీకొనడంతో నలుగురు ఘటనాస్థలంలోనే మృతి చెందగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు ఆరోపించారు. సమాచారం అందుకున్న వెంటనే కురసాల కన్నబాబు పార్టీ నాయకులతో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని, అనంతరం కాకినాడ జనరల్ ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. క్షతగాత్రులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతుండటమే ఇలాంటి ప్రమాదాలకు ప్రధాన కారణమని విమర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.5 లక్షల నష్టపరిహారం అందించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటన వివరాలను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ జనరల్ సెక్రటరీ కొప్పిశెట్టి గణేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించిన మండల కాంగ్రెస్ నాయకులు



**వేద న్యూస్, వెల్గటూర్ :**

వెల్గటూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గోళ్ల తిరుపతి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు శిబిరంలో విద్యార్థులకు అందిస్తున్న శిక్షణను, వసతులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి వేసవి శిబిరాల్లో పాల్గొని తమలోని సృజనాత్మకతను, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని, సమయాన్ని వృథా చేయకుండా ఇక్కడ నేర్పించే అంశాలను నేర్చుకోవాలని కోరారు. శిబిర నిర్వాహకులను ఈ సందర్భంగా వారు అభినందించారు. అనంతరం క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షుడు గంధ్ర ప్రతాప్ రావు, మాజీ సర్పంచ్ మెరుగు మురళీ గౌడ్, కోటిలింగాల ఆలయ కమిటీ చైర్మన్ పుధారి రమేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ సెక్రెటరీ శ్రీకాంత్ రావు, బిసి సెల్ అధ్యక్షుడు బందెల ఉదయ్ గౌడ్, వార్డ్ సభ్యులు గుండాటి సందీప్ రెడ్డి, నక్క సురేష్, స్థానిక నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జూపాక ప్రవీణ్, రేకుంట నర్సయ్య, బొడ్డు సంతోష్, గుమ్ముల అజయ్, దుంపటి సత్యం, మూగల రమేష్, మన్నే జితేందర్, నేరెళ్ళ బుచ్చయ్య, గుమ్మడి శ్రీహరి, ఆశా వర్కర్లు, శిక్షకులు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

# సింగరేణిలో ఉచిత కరాటే శిక్షణ ప్రారంభం



**వేద న్యూస్, కారేపల్లి :**

సింగరేణి గ్రామ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత పిల్లలు చదువుతో పాటు క్రీడలు, ఆత్మరక్షణ కళల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. మొదటి రోజు నుంచే పిల్లలు ఉత్సాహంగా శిక్షణలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కరాటే శిక్షణ ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం, మానసిక ధైర్యం పెరుగుతాయని తెలిపారు. గ్రామ యువత రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచేలా తీర్చిదిద్దాలని కోరారు. ఈ సందర్భంగా శిక్షకులు విద్యార్థులకు ప్రాథమిక కరాటే విన్యాసాలు, శారీరక వ్యాయామాలు నేర్పించారు. గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు కూడా కార్యక్రమాన్ని అభినందిస్తూ తమ పిల్లలను శిక్షణకు పంపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు అంకోజు సరోజ, రావుల రాజశేఖర్, మేకల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో బీసీలదే అధికారం

- జూలై 12న హైదరాబాద్‌లో రాజకీయ ప్లీనరీ
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



**వేద న్యూస్, సూర్యాపేట :**

2028లో తెలంగాణ రాష్ట్రంలో బీసీలు అధికారం చేపట్టడం ఖాయమని, తెలంగాణ గడ్డ బీసీలకు అడ్డాగా మారిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ సమాజంలో రాజకీయ చైతన్యం పెరిగిందని, ఇక అగ్రకులాల రాజకీయాలు సాగవని వ్యాఖ్యానించారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. జూలై 12న హైదరాబాద్‌లో బీసీల రాజకీయ ప్లీనరీ, ఆగస్టు 7న జాతీయ ఓబీసీ సమావేశం, సెప్టెంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా బీసీల రాజ్యాధికార రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో 10 లక్షల మందితో రాజకీయ యుద్ధభేరి సభ నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర మల్సూర్ గౌడ్, బీసీ ఐకాస చైర్మన్ జాజుల లింగం గౌడ్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన ఇంధన ధరలతో ప్రజలపై భారం

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ధరావత్ బద్రు నాయక్



**వేద న్యూస్, కారేపల్లి :**

దేశవ్యాప్తంగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, సిఎన్‌జీ గ్యాస్ ధరలు సామాన్య ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ధరావత్ బద్రు నాయక్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇల్లందులో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తయిన వెంటనే ఇంధన ధరలు పెంచడం ప్రజల విశ్వాసానికి దెబ్బతీసిందన్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం రైతుల నుంచి సాధారణ ప్రజల వరకు ప్రతి వర్గంపై పడుతోందని పేర్కొన్నారు. జిల్లాలో డీజిల్ కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలకు డీజిల్ అందక పంట పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పలుచోట్ల పెట్రోల్ బంకుల వద్ద "నో స్టాక్" బోర్డులు కనిపించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సివిల్ సప్లై అధికారులు వెంటనే స్పందించి పెట్రోల్, డీజిల్ సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలి

- హెల్త్ కార్డులు, పీఆర్‌సీ అమలు చేయాలి
- తెలంగాణ ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్

**వేద న్యూస్, కారేపల్లి :**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చొరవ చూపాలని తెలంగాణ ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూకర రాంబాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంపీ నాయక్, మాలోత్ ప్రతాప్ సింగ్ సంయుక్త ప్రకటనలో మాట్లాడుతూ.. జూన్ 2 నాటికి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో హెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న భాషా పండితులు, పీఈటీలకు అర్హతల మేరకు పదోన్నతులు కల్పించాలని, కాంట్రాక్ట్ గురుకుల ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస కాలపరిమితి వేతన విధానం అమలు చేయాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రహారీ గోడలు, సౌర విద్యుత్, వాచ్‌మెన్ గదులు, ఉపాధ్యాయుల వసతి గృహాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేసి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని టీఈఏటీవీఎస్ నాయకులు కోరారు.

# గ్రంథాలయ చైర్మన్ కు శుభాకాంక్షలు

- సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి



**వేద న్యూస్, కాజీపేట :**

సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియమితులైన తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపెల్లి చంద్రమన్నాను సంఘం రాష్ట్ర నాయకులు సిద్దిపేటలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రమన్నాకు పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేసిన నాయకుడికి కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తింపు ఇచ్చి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం అభినందనీయమన్నారు. కార్మికులకు రావాల్సిన బెనిఫిట్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, కార్మిక సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. అలాగే త్వరలోనే లేబర్ బోర్డు చైర్మన్ నియామకం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బస్కే దశరథం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నరపు మహేందర్, నాయకులు రాసమల్ల కొమరన్న, తుడి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో కాలుష్యంపై కఠిన నిబంధనలు

**వేద న్యూస్ డెస్క్:**




దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర కాలుష్య సమస్యను నియంత్రించేందుకు వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ కీలక నిర్ణయాలు తీసుకుంది. కొత్తగా అమల్లోకి రానున్న నిబంధనలు వాహనదారులు, వాణిజ్య రవాణా రంగం, రైతులపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్నాయి. ప్రతి ఏడాది శీతాకాలంలో విషపూరిత పొగమంచుతో ఢిల్లీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గాలి నాణ్యత మెరుగుదల లక్ష్యంగా కమిషన్ మూడు ప్రధాన నిర్ణయాలను ప్రకటించింది. అందులో భాగంగా అక్టోబర్ 1, 2026 నుంచి మొత్తం జాతీయ రాజధాని ప్రాంతం ఢిల్లీలో "పీయూసీ లేకపోతే ఇంధనం లేదు" నిబంధన అమల్లోకి రానుంది. వాహనాలకు చెల్లుబాటు అయ్యే కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రం లేకపోతే పెట్రోల్ బంకుల్లో ఇంధనం ఇవ్వరు. దీంతో ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా పొల్యూషన్ తనిఖీలు చేయించుకోవాల్సి ఉంటుంది. అలాగే త్రీ వీలర్ వాహనాలను పూర్తిగా విద్యుత్ ఆధారితంగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. జనవరి 1, 2027 నుంచి ఢిల్లీలో కొత్త పెట్రోల్, డీజిల్, సీఎన్జీ ఆటో రిక్షాల నమోదు నిలిపివేయనున్నారు. కేవలం విద్యుత్ త్రీ వీలర్లకే అనుమతి ఇవ్వనున్నారు. ఇదే విధానం 2028 జనవరి 1 నుంచి గురుగ్రామ్, ఫరీదాబాద్, నోయిడా, ఘజియాబాద్, సోనిపత్ వంటి కీలక నగరాల్లో అమల్లోకి రానుంది. అనంతరం 2029 జనవరి 1 నుంచి మొత్తం ఎన్సిఆర్ పరిధిలో విద్యుత్ త్రీ వీలర్లకే రిజిస్ట్రేషన్ అనుమతిస్తారు. మరోవైపు పంట గడ్డి దహనం సమస్యపై కూడా కమిషన్ కఠిన చర్యలకు సిద్ధమైంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో రైతులు పంట గడ్డిని తగులబెట్టడం వల్ల ఢిల్లీ గాలి నాణ్యత తీవ్రంగా దెబ్బతింటోంది. దీనికి శాశ్వత పరిష్కారంగా "దిశ సంఖ్య 99" పేరుతో ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. దీని ప్రకారం పంట గడ్డి దహనాన్ని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక పరిరక్షణ దళాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి వ్యవసాయ భూమిని డిజిటల్ పద్ధతిలో మ్యాపింగ్ చేసి, ప్రత్యేక నోడల్ అధికారులను నియమించనున్నారు. 2026 వరి కోత సీజన్ నాటికి పంట వ్యర్థాల దహనాన్ని పూర్తిగా సున్నాకు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ కొత్త నిబంధనలు ప్రారంభంలో ప్రజలకు కొంత ఇబ్బందిగా అనిపించినప్పటికీ, ఢిల్లీ-ఎన్సిఆర్ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించడంలో ఇవి కీలక మైలురాళ్లుగా మారనున్నాయని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఎస్‌బీఐ ఎఫ్‌డీలపై ఆకర్షణీయ వడ్డీ

**వేద న్యూస్ డెస్క్:**




సురక్షితమైన పెట్టుబడులతో స్థిరమైన ఆదాయం పొందాలనుకునే వారికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎఫ్‌డీ పథకాలు మంచి ఎంపికగా మారుతున్నాయి. ముఖ్యంగా దీర్ఘకాలిక ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలపై బ్యాంకు అందిస్తున్న అధిక వడ్డీ రేట్లు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ఎస్‌బీఐ వివిధ కాలపరిమితుల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 3.05 శాతం నుంచి 7.15 శాతం వరకు వడ్డీ అందిస్తోంది. 7 రోజుల నుంచి ప్రారంభమయ్యే స్వల్పకాలిక ఎఫ్‌డీలపై 3.05 శాతం నుంచి 3.65 శాతం వరకు వడ్డీ లభిస్తోంది. 46 రోజుల నుంచి 179 రోజుల కాలపరిమితి గల డిపాజిట్లపై 4.90 శాతం నుంచి 5.50 శాతం వరకు వడ్డీ అందిస్తున్నారు. అలాగే 180 రోజుల నుంచి 210 రోజుల వరకు ఉన్న ఎఫ్‌డీలపై 5.65 శాతం నుంచి 6.25 శాతం వరకు రాబడి లభిస్తోంది. దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టేవారికి 5 నుంచి 10 సంవత్సరాల కాలపరిమితి గల ఎఫ్‌డీలు మరింత ప్రయోజనకరంగా మారాయి. ఈ విభాగంలో బ్యాంకు 6.05 శాతం నుంచి 7.15 శాతం వరకు వడ్డీ రేట్లను అందిస్తోంది. సురక్షితమైన, స్థిరమైన ఆదాయం కోరుకునే వారికి ఇవి మంచి పెట్టుబడి అవకాశాలుగా ఆర్థిక ఒక సాధారణ ఖాతాదారుడు 6 సంవత్సరాల ఎఫ్‌డీ పథకంలో రూ.3 లక్షలు పెట్టుబడి పెడితే మెచ్యూరిటీ సమయంలో మొత్తం రూ.4,30,120 లభిస్తాయి. ఇందులో సుమారు రూ.1,30,120 వడ్డీ రూపంలో వస్తుంది. అదే పథకంలో సీనియర్ సిటిజన్లు రూ.3 లక్షలు డిపాజిట్ చేస్తే మెచ్యూరిటీ సమయంలో మొత్తం రూ.4,56,276 పొందుతారు. ఇందులో సుమారు రూ.1,56,276 వడ్డీగా లభిస్తుంది.లభిస్తుంది.

# అమెజాన్‌పై వినియోగదారుల దావా




**వేద న్యూస్ డెస్క్:**

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల వ్యవహారం ఇప్పుడు మరోసారి సంచలనంగా మారింది. ట్రంప్ చట్టవిరుద్ధంగా విధించిన సుంకాల కారణంగా వస్తువుల ధరలు పెరిగి తమపై అదనపు భారం పడిందని ఆరోపిస్తూ వినియోగదారులు ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్‌పై సామూహిక దావా వేశారు. సియాటిల్ ఫెడరల్ కోర్టులో దాఖలైన ఈ వ్యాజ్యం అమెరికాలో తీవ్ర చర్చకు దారితీసింది. వినియోగదారుల ఆరోపణల ప్రకారం, ట్రంప్ విధించిన భారీ సుంకాల వల్ల దిగుమతి వస్తువుల ధరలు పెరిగాయి. ఆ అదనపు భారాన్ని అమెజాన్ నేరుగా వినియోగదారులపై మోపిందని వారు పేర్కొన్నారు. అనంతరం అమెరికా సుప్రీంకోర్టు ట్రంప్ సుంకాలను చట్టవిరుద్ధమని ప్రకటించినప్పటికీ, అమెజాన్ మాత్రం ప్రభుత్వానికి చెల్లించిన సుంకాల రీఫండ్‌ను వినియోగదారులకు తిరిగి ఇవ్వలేదని దావాలో ఆరోపించారు. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టాన్ని ఉపయోగించి ట్రంప్ విధించిన సుంకాలు తన అధికార పరిధికి మించినవని అమెరికా సుప్రీంకోర్టు గతంలో 6-3 మెజారిటీతో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు తర్వాత అనేక కంపెనీలు ప్రభుత్వంనుంచి బిలియన్ల డాలర్ల రీఫండ్‌లు కోరడం ప్రారంభించాయి. అయితే అమెజాన్ మాత్రం ఆ మార్గాన్ని ఎంచుకోలేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. "అధ్యక్షుడి మన్ననలు పొందేందుకు అమెజాన్ వినియోగదారుల డబ్బును ఉపయోగించింది. ఇప్పటికే చెల్లనివిగా ప్రకటించిన సుంకాల భారాన్ని కస్టమర్లపై మోపడం అన్యాయం" అని వ్యాజ్యంలో పేర్కొన్నారు. అమెజాన్ చర్యలు వాషింగ్టన్ రాష్ట్ర వినియోగదారుల రక్షణ చట్టాలను ఉల్లంఘించాయని కూడా దావాలో ఆరోపించారు. ఇదే తరహాలో ఇప్పటికే కాస్ట్‌కో, నైక్, ఫెడెక్స్ వంటి సంస్థలపై కూడా వినియోగదారులు కేసులు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే వస్తువులను దిగుమతి చేసుకున్న కంపెనీలకు మాత్రమే ప్రభుత్వ రీఫండ్ వర్తిస్తుందని, వినియోగదారులు నేరుగా సుంకాల వాపసు కోరలేరని తాజా వ్యాజ్యంలో ప్రస్తావించారు. ఇంకా 2025 ఏప్రిల్‌లో ఒక ఉత్పత్తి ధరలో సుంకాల వాటా ఎంత ఉందో వినియోగదారులకు చూపించాలని అమెజాన్ యోచించిందని, ఆ సమయంలో వైట్ హౌస్ నుంచి వ్యతిరేకత ఎదురైందని వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఈ కేసుపై అమెజాన్ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు

# పంజాబ్ నిర్ణయంపై అశ్విన్ అసహనం

**వేద న్యూస్ డెస్క్:**



పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో వరుస ఓటములతో తీవ్ర ఒత్తిడిలో పడింది. టోర్నీ ఆరంభంలో వరుస విజయాలతో దూసుకెళ్లిన పంజాబ్.. ఇప్పుడు ప్లే ఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. వరుసగా ఐదు పరాజయాలు ఎదుర్కొని పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జట్టు యాజమాన్యం తీసుకున్న రెండు హోం వేదికల నిర్ణయంపై భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ముల్లాన్‌పూర్, ధర్మశాల వేదికలను హోం గ్రౌండ్‌లుగా ఎంచుకోవడం జట్టు ప్రదర్శనపై ప్రతికూల ప్రభావం చూపుతోందని అభిప్రాయపడ్డాడు. "కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ వంటి విజయవంతమైన జట్లు ఒకే వేదికపై తమ హోం మ్యాచ్‌లు ఆడుతున్నాయి. కానీ పంజాబ్ మాత్రం రెండు వేదికల మధ్య మారాల్సి వస్తోంది. ఇది జట్టుకు ఇబ్బందిగా మారింది" అని అశ్విన్ పేర్కొన్నాడు. ముల్లాన్‌పూర్‌లో పంజాబ్ అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ, ధర్మశాల పిచ్ పరిస్థితులకు జట్టు అలవాటు పడలేకపోతోందని ఆయన అభిప్రాయపడ్డాడు. అక్కడ బ్యాటింగ్ అంత సులభంగా ఉండదని, పిచ్‌కు సెట్ అయ్యేలోపే జట్టు 20 నుంచి 40 పరుగులు తక్కువ చేస్తోందని చెప్పాడు. పంజాబ్ వరుస పరాజయాలకు కేవలం కెప్టెన్సీ లేదా ఆటగాళ్ల వైఫల్యమే కారణం కాదని, వేదిక మార్పు కూడా ప్రధాన కారణాల్లో ఒకటని అశ్విన్ స్పష్టం చేశాడు. ఇక ప్లే ఆఫ్స్ ఆశలు నిలుపుకోవాలంటే పంజాబ్ ఇక మిగిలిన ప్రతి మ్యాచ్‌లోనూ తప్పక గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తదుపరి మ్యాచ్‌లో పంజాబ్.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది.

# పాక్ జట్టుకు ఫాతిమా సనా నాయకత్వం

**వేద న్యూస్ డెస్క్:**




మహిళల టీ20 ప్రపంచకప్ 2026 కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. జట్టుకు కెప్టెన్‌గా ఫాతిమా సనాను నియమించింది. వరుసగా రెండోసారి మహిళల టీ20 ప్రపంచకప్‌లో పాక్ జట్టును ఆమెనే ముందుండి నడిపించనున్నారు. ఇంగ్లండ్, వేల్స్ వేదికగా జూన్ 12 నుంచి జూలై 5 వరకు ఈ మెగా టోర్నీ జరగనుంది. తాజాగా జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న ఫాతిమా సనా ప్రపంచ రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. కేవలం 15 బంతుల్లోనే అర్ధశతకం సాధించి మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో వేగవంతమైన ఫిఫ్టీ నమోదు చేశారు. పాక్ జట్టులో పలువురు యువ ఆటగాళ్లు తొలిసారి ప్రపంచకప్ ఆడనున్నారు. ఈమాన్ ఫాతిమా, నటాలియా పర్వేజ్, రమీన్ షమీమ్, సైరా జబీన్, తస్మియా రుబాబ్‌లకు ఇదే తొలి ప్రపంచకప్ కావడం విశేషం. బ్యాటింగ్ విభాగంలో గుల్ ఫిరోజా, మునీబా అలీ, ఫాతిమా సనాలపై పాక్ జట్టు ఆశలు పెట్టుకుంది. స్పిన్ విభాగంలో సాదియా ఇక్బాల్, నష్రా సంధు, తుబా హసన్ కీలకంగా మారనుండగా, పేస్ దాడిని ఫాతిమా సనా, దయానా బేగ్ ముందుండి నడిపించనున్నారు. గ్రూప్-1లో ఉన్న పాకిస్థాన్ జట్టు భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లతో పోటీపడనుంది. జూన్ 14న బర్మింగ్‌హామ్ వేదికగా భారత మహిళల క్రికెట్ జట్టుతో జరిగే మ్యాచ్‌తో పాక్ ప్రపంచకప్ ప్రయాణాన్ని ప్రారంభించనుంది. ప్రపంచకప్‌కు ముందు పాకిస్థాన్ జట్టు ఐర్లాండ్‌లో జరిగే త్రైసిరీస్‌లో వెస్టిండీస్‌తో కలిసి పాల్గొననుంది. అలాగే శ్రీలంక, స్కాట్లాండ్ జట్లతో వార్మప్ మ్యాచ్‌లు కూడా ఆడనుంది.

# అఫ్గాన్ సిరీస్‌కు గిల్ కెప్టెన్?

**వేద న్యూస్ డెస్క్:**




భారత జాతీయ క్రికెట్ జట్టు అఫ్గానిస్థాన్‌తో జరగనున్న సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఐపీఎల్ ముగిసిన కొద్ది రోజులకే ఈ సిరీస్ ప్రారంభం కానుండటంతో ఆటగాళ్ల ఎంపికపై ఆసక్తి నెలకొంది. జూన్ 6న ముల్లాన్‌పూర్ వేదికగా ఏకైక టెస్టు మ్యాచ్ జరగనుండగా, అనంతరం మూడు వన్డే మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ సిరీస్‌లో భారత జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాలని సెలెక్టర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది. వికెట్ కీపర్ ఎంపికలో మాత్రం ఆసక్తికర చర్చ నడుస్తోంది. వన్డేల్లో తొలి ప్రాధాన్యంగా కేఎల్ రాహుల్‌ను కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నప్పటికీ, రెండో ఎంపికగా ఇషాన్ కిషన్ పేరు బలంగా వినిపిస్తోంది. ఇటీవల ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన చేస్తున్న ఇషాన్ కిషన్‌ను మళ్లీ జట్టులోకి తీసుకోవాలని సెలెక్టర్లు ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై తరఫున 12 మ్యాచ్‌లలో 420 పరుగులు సాధించిన ఇషాన్ కిషన్ మంచి ఫామ్‌లో కొనసాగుతున్నాడు. ఈ సిరీస్‌కు సంబంధించిన భారత జట్టును మే 19న భారత క్రికెట్ నియంత్రణ మండలి ఎంపిక కమిటీ అధికారికంగా ప్రకటించనుంది.

# ఐసీసీ భేటీకి నఖ్వీ వస్తాడా?

**వేద న్యూస్ డెస్క్:**



అంతర్జాతీయ క్రికెట్ మండలి త్రైమాసిక సమావేశం ఈసారి భారత్‌లో నిర్వహించనుండటం క్రికెట్ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. మే 31న జరగనున్న ఐపీఎల్ 2026 ఫైనల్ రోజునే ఐసీసీ ఛైర్మన్ జై షా వివిధ దేశాల ప్రతినిధులతో సమావేశం కానున్నట్లు సమాచారం.మొదట ఈ సమావేశాన్ని దోహా, ఖతార్‌లో నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ.. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా వేదికను భారత్‌కు మార్చారు. తాజా షెడ్యూల్ ప్రకారం మే 21న జై షా ఐసీసీ సభ్యులతో వర్చువల్ సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం మే 30 లేదా 31 తేదీల్లో అహ్మదాబాద్‌లో ప్రత్యక్ష సమావేశం జరగనుంది. అయితే ఈ సమావేశానికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు, ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ హాజరవుతారా లేదా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. భారత్, బీసీసీఐపై తరచూ విమర్శలు చేసే నఖ్వీ.. ఈసారి భారత్‌కు వస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఆసియా కప్ సందర్భంగా భారత జట్టుకు ట్రోఫీ అందజేయకుండా వెళ్లిపోవడం, అలాగే టీ20 ప్రపంచకప్ సమయంలో టీమిండియాతో మ్యాచ్‌ల విషయంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం కూడా ఇప్పుడు మళ్లీ చర్చకు వస్తున్నాయి. ఒకవేళ నఖ్వీ భారత్‌కు రావాలనుకున్నా.. అందుకు పాకిస్థాన్ ప్రభుత్వ అనుమతితో పాటు భారత ప్రభుత్వ ఆమోదం కూడా అవసరం అవుతుంది. ఈ నేపథ్యంలో ఆయన ప్రత్యక్షంగా హాజరవుతారా? లేక పాకిస్థాన్ నుంచే వర్చువల్‌గా సమావేశంలో పాల్గొంటారా? అన్నది ఇంకా స్పష్టత రాలేదు. ఇక ఐసీసీ సమావేశంలో అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్, ద్వైపాక్షిక సిరీస్‌లు, ఆసియా కప్ నిర్వహణ, భవిష్యత్ టోర్నీల అంశాలపై కీలక చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది

వేద న్యూస్

ఆదివారం మే 17, 2026

# సినిమాలకు గ్యాప్ రావడం బాధేసింది: సదా

**వేద న్యూస్ డెస్క్:**



తెలుగు సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా ప్రేక్షకుల ప్రేమను అందుకుంటున్న నటి సదా తన సినీ ప్రయాణం, కెరీర్‌లో ఎదురైన సవాళ్లు, వ్యక్తిగత అనుభవాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జయం', 'అపరిచితుడు' వంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకులకు ఎంతో దగ్గరైనప్పటికీ, తన ప్రతిభకు తగిన స్థాయిలో అవకాశాలు రాకపోవడం బాధ కలిగించిందని ఆమె పేర్కొన్నారు. తన సినీ ప్రయాణంలో తక్కువ సినిమాలే చేసినా ప్రేక్షకుల ప్రేమ మాత్రం ఎప్పుడూ తగ్గలేదని సదా తెలిపారు. జయం, నితిన్, ఉదయ్ కిరణ్ వంటి హీరోలతో చేసిన చిత్రాలు ఇప్పటికీ ప్రేక్షకులకు గుర్తుండిపోవడం ఆనందంగా ఉందన్నారు. "జయం సినిమా తర్వాత కూడా నా కెరీర్‌లో పెద్ద గ్యాప్ వచ్చింది. అవకాశాలు రాలేదని చెప్పలేను కానీ అవి నా వరకు చేరలేదు. అప్పట్లో సోషల్ మీడియా లేకపోవడం, ముంబైలో ఉండటం వల్ల ఇండస్ట్రీలో సరైన కమ్యూనికేషన్ జరగలేదు" అని వెల్లడించారు. సినిమా నేపథ్యం లేని కుటుంబం నుంచి వచ్చిన తాను మొదట్లో నటనను పూర్తి స్థాయి కెరీర్‌గా భావించలేదని సదా తెలిపారు. 'జయం' తర్వాత తిరిగి ఐటీ చదువులపై దృష్టి పెట్టానని, ఆ సినిమా అంత పెద్ద విజయమవుతుందని అప్పట్లో ఊహించలేదని చెప్పారు. "జయం లేదా అపరిచితుడు లాంటి సినిమాలు నా జీవితాన్ని మార్చేశాయి. ఆ సినిమాలు లేకపోతే నేను ఈరోజు ఇక్కడ ఉండేదాన్ని కాదు" అని ఆమె అన్నారు. 'జయం' సినిమాలోని "వెళ్లవయ్యా వెళ్లు" డైలాగ్ ఇప్పటికీ ప్రేక్షకులు గుర్తుపెట్టుకోవడం ఆనందంగా ఉంటుందని సదా చెప్పారు. అలాగే 'రాను రానంటూనే చిన్నదో' పాట రీమేక్ విషయంలో తనను ఎవరూ సంప్రదించలేదని స్పష్టం చేశారు. "చాలా ప్రాజెక్టులు నా వరకు రావడం లేదు. నిర్మాతలు ప్రయత్నించామని చెబుతారు కానీ మధ్యలో ఎక్కడ ఆగిపోతుందో అర్థం కాదు" అంటూ ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తమిళంలో చేసిన 'టార్చ్ లైట్' చిత్రం గురించి మాట్లాడుతూ ఆ సినిమా తనకు మానసికంగా చాలా సవాల్‌గా అనిపించిందని తెలిపారు. "అలాంటి పాత్ర చేయడం నాకు చాలా భయంగా అనిపించింది. కానీ కథ అవసరం కావడంతో చేశాను. అయితే ప్రేక్షకులు కథను అర్థం చేసుకోవడం కంటే నేను ఎందుకు అలాంటి పాత్ర చేశానని విమర్శించారు. ఆ సినిమా చేసిన తర్వాత చాలా బాధపడ్డాను" అని ఆమె పేర్కొన్నారు. బోల్డ్ పాత్రలు చేయడం తనకు అభ్యంతరం కాదని, కానీ కథకు అవసరమైతే మాత్రమే అలాంటి పాత్రలు చేస్తానని సదా స్పష్టం చేశారు. ప్రస్తుతం కూడా మంచి కథలు వస్తే తప్పకుండా నటిస్తానని, ప్రేక్షకుల ప్రేమే తనకు పెద్ద బలం అని ఆమె తెలిపారు.


# 'దళపతి' ట్యాగ్‌కే విజయ్ గ్రీన్ సిగ్నల్

**వేద న్యూస్ డెస్క్:**




తమిళనాడు రాజకీయాల్లో సంచలన విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయకన్' విడుదలకు సిద్ధమవుతోంది. ఎన్నికలకు ముందే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పలు కారణాలతో వాయిదా పడుతూ వచ్చినప్పటికీ, వచ్చే నెలలో భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న నేపథ్యంలో, సినిమాలో ఆయన పేరుకు ముందు ఎప్పటి నుంచో వినిపిస్తున్న 'దళపతి' బిరుదుకు బదులుగా 'ముఖ్యమంత్రి విజయ్' అని ప్రదర్శించాలని నిర్మాతలు భావించినట్లు సమాచారం. అయితే ఈ ప్రతిపాదనను విజయ్ సున్నితంగా తిరస్కరించినట్టు తెలుస్తోంది. తనను ఈ స్థాయికి తీసుకొచ్చింది ప్రేక్షకుల ప్రేమేనని, అందుకే అభిమానులు ఇచ్చిన 'దళపతి' బిరుదునే కొనసాగించాలని ఆయన స్పష్టం చేసినట్లు కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. అంతేకాదు, రాజకీయ హోదాకు తగ్గట్టుగా సినిమాలోని కొన్ని సన్నివేశాలు, పవర్‌ఫుల్ రాజకీయ డైలాగులను మార్చాలనే ఆలోచనను కూడా విజయ్ అంగీకరించలేదని సమాచారం. సినిమాను రాజకీయ ప్రచార వేదికగా కాకుండా, పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రంగానే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది. విజయ్ తీసుకున్న ఈ నిర్ణయంపై అభిమానులతో పాటు సినీ వర్గాల్లో కూడా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయాల్లో ఉన్నప్పటికీ తన సినీ వ్యక్తిత్వాన్ని మార్చుకోకుండా ప్రేక్షకుల అభిమానాన్ని గౌరవించడం విశేషమని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది.

# 'పెద్ది' ట్రైలర్‌పై చిరు ఫిదా.. "చరణ్ పోరాడాడు సారు!"




**వేద న్యూస్ డెస్క్:**

పెద్ది చిత్రంపై రోజురోజుకూ అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ఇప్పటికే టాలీవుడ్‌లోనే కాదు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. 'ఉప్పెన' వంటి భావోద్వేగభరితమైన బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రం కావడం, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం, మైత్రీ మూవీ మేకర్స్ వంటి అగ్ర నిర్మాణ సంస్థలు నిర్మిస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. మే 18న విడుదల కానున్న ట్రైలర్‌ను ఇప్పటికే ప్రత్యేకంగా వీక్షించిన చిరంజీవి తన స్పందనతో సోషల్ మీడియాలో అభిమానుల్లో మరింత హైప్ పెంచేశారు. ట్రైలర్ చూసిన వెంటనే ఆయన తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలో చేసిన పోస్టు ఇప్పుడు వైరల్‌గా మారింది. "ఇప్పుడే 'పెద్ది' ట్రైలర్ చూశాను.. జస్ట్ వావ్ అంతే!" అంటూ ప్రారంభించిన మెగాస్టార్.. ట్రైలర్‌లోని భావోద్వేగాలు, యాక్షన్ ఎలిమెంట్స్, ఎలివేషన్స్ అన్నీ అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. మూడు నిమిషాల పాటు సాగిన ఈ ట్రైలర్ పూర్తిగా పవర్ ప్యాక్డ్‌గా ఉందని, ప్రతి సీన్ ప్రేక్షకులను కట్టిపడేసేలా ఉందని చిరంజీవి పేర్కొన్నారు. ముఖ్యంగా రామ్ చరణ్ నటన గురించి మాట్లాడిన ఆయన.. "చరణ్ ఈ సినిమాలో కేవలం నటించలేదు.. జీవించాడు" అన్నట్టుగా ప్రశంసలు కురిపించినట్లు అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. బుచ్చిబాబు విజన్, రెహమాన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజువల్స్ అన్నీ కలిసి ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని తెలిపారు. అయితే ఈ పోస్టులో అభిమానులను మరింత ఉత్సాహానికి గురిచేసింది మాత్రం చిరంజీవి ఇచ్చిన 'చిరు లీక్'. చాలా రోజుల తర్వాత అభిమానులకు మళ్లీ ఒక లీక్ ఇస్తున్నానంటూ సరదాగా చెప్పిన చిరంజీవి.. ట్రైలర్‌లోని ఓ పవర్‌ఫుల్ డైలాగ్‌ను బయటపెట్టారు. "మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారుడ నేను పోరాడాను సారు.." అనే డైలాగ్ తనకు విపరీతంగా నచ్చిందని వెల్లడించారు. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలోని భావోద్వేగ తీవ్రత ఎంత బలంగా ఉండబోతోందో అర్థమవుతోందని అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. డైలాగ్ లీక్ చేసిన తర్వాత దర్శకుడు బుచ్చిబాబుకు సరదాగా క్షమాపణలు కూడా చెప్పారు చిరంజీవి. "సారీ బుచ్చిబాబు.. ట్రైలర్ చూశాక అదుపులో ఉండలేకపోయాను" అంటూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. మెగాస్టార్ వ్యాఖ్యలతో 'పెద్ది' ట్రైలర్‌పై ఒక్కసారిగా అంచనాలు రెట్టింపు అయ్యాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్‌లు సినిమాపై భారీ హైప్ తీసుకురాగా.. ఇప్పుడు చిరంజీవి రివ్యూ ఆ అంచనాలను మరింత పెంచేసింది. ముఖ్యంగా రామ్ చరణ్ లుక్, గ్రామీణ నేపథ్యంలో కనిపిస్తున్న భారీ యాక్షన్ సన్నివేశాలు, ఎమోషనల్ టచ్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ట్రైలర్ విడుదలకు ముందే సోషల్ మీడియాలో వంటి హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయనున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నాడనే ప్రచారం కూడా అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఇక మే 18న విడుదల కానున్న ట్రైలర్ కోసం మెగా అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. చిరంజీవి ఇచ్చిన రివ్యూతో ఇప్పుడు 'పెద్ది' ట్రైలర్ విడుదలే ఒక పెద్ద ఈవెంట్‌గా మారిపోయింది.

# ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు బర్త్‌డే ట్రీట్.. అర్ధరాత్రే 'ఎన్టీఆర్‌నీల్' గ్లింప్స్

**వేద న్యూస్ డెస్క్:**




టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులకు ఊహించని సర్‌ప్రైజ్ సిద్ధమైంది. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు ప్రశాంత్ నీల్ భారీ ప్లాన్ సిద్ధం చేశారు. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించిన తొలి గ్లింప్స్‌ను మే 19 అర్ధరాత్రి విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో నందమూరి అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్‌తో రూపొందిస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ గ్లింప్స్‌ను తెలుగు మాత్రమే కాకుండా హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునేలా చిత్రబృందం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదల చేసిన పోస్టర్ కూడా అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. ఎడారి మధ్యలో చేతిలో కర్ర పట్టుకుని నిలబడి ఉన్న ఎన్టీఆర్ లుక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "తుఫాన్‌కు ముందు నిశ్శబ్దం" అనే భావనను గుర్తు చేసేలా పోస్టర్‌కు ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. ప్రశాంత్ నీల్ మరోసారి భారీ యాక్షన్ ప్రపంచాన్ని చూపించబోతున్నాడని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మే 19 అర్ధరాత్రి విడుదల కానున్న గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరగనున్నాయి.

# 'మరీచిక' ట్రైలర్ విడుదల.. ఉత్కంఠ పెంచుతున్న థ్రిల్లర్

**వేద న్యూస్ డెస్క్:**




టాలీవుడ్ యువ హీరో విరాజ్ అశ్విన్, ప్రముఖ నటీమణులు రెజీనా కాసాండ్రా, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'మరీచిక' ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. సస్పెన్స్, ప్రేమ, భావోద్వేగాల మేళవింపుతో రూపొందుతున్న ఈ చిత్రానికి దర్శకుడు సతీష్ కాసెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. చిలకా ప్రొడక్షన్ పతాకంపై రాజీవ్ చిలకా, మేఘనా చిలకా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన అధికారిక ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ట్రైలర్ ప్రారంభం నుంచే ఉత్కంఠభరిత వాతావరణాన్ని సృష్టిస్తూ కథపై ఆసక్తిని పెంచుతోంది. ప్రేమ, మోసం, మానసిక సంఘర్షణల చుట్టూ తిరిగే కథాంశంతో ఈ చిత్రం సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. ముఖ్యంగా పాత్రల మధ్య సాగే భావోద్వేగ సన్నివేశాలు, థ్రిల్లింగ్ అంశాలు సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. ఈ చిత్రానికి సంగీత దిగ్గజం ఇళయరాజా సంగీతం అందించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఆయన అందించిన నేపథ్య సంగీతం ట్రైలర్‌కు మరింత బలం చేకూర్చింది. సన్నివేశాలకు అనుగుణంగా వినిపించిన నేపథ్య స్వరాలు ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతూ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి.

# ప్రేమపై తమన్నా ఆసక్తికర వ్యాఖ్యలు

**వేద న్యూస్ డెస్క్:**



టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తన అందం, నటనతో అభిమానులను ఆకట్టుకున్న నటి తమన్నా భాటియా తాజాగా ప్రేమ, బంధాలపై చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ప్రేమ అంటే ఏమిటి, సంబంధాల్లో వ్యక్తిగత స్వేచ్ఛ ఎంత ముఖ్యమనే అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో ప్రేమ ఒక్కసారి మాత్రమే కాకుండా ఎన్నోసార్లు పుడుతుందని తమన్నా అన్నారు. ప్రేమ అనేది జీవితంలో పదేపదే అనుభూతి చెందాల్సిన భావమని, దానిని కేవలం ఒక సంఘటనగా చూడకూడదని పేర్కొన్నారు. ప్రస్తుతం యువత ప్రేమ, సంబంధాల విషయంలో చాలా గందరగోళానికి గురవుతున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. ఎవరినైనా నిజంగా ప్రేమిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని తమన్నా స్పష్టం చేశారు. మన ఆలోచనలు, అభిరుచులను ఎదుటివారిపై బలవంతంగా రుద్దడం ప్రేమ కాదని తెలిపారు. ప్రేమ అనేది హావభావాలతో చూపించేది కాదని, అది మనసులో పుట్టే స్వచ్ఛమైన భావన అని వివరించారు. వ్యక్తిగత బంధాల్లో పరస్పర గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ చాలా ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. ఒకరిని ప్రేమించడం అంటే వారి నిర్ణయాలను గౌరవించడం కూడా కావాలని చెప్పారు. ప్రస్తుతం తమన్నా చేసిన ఈ వ్యాఖ్యలు యువతలో విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. సినిమాల విషయానికి వస్తే, తమన్నా వరుస చిత్రాలతో బిజీగా కొనసాగుతున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో పలు ప్రాజెక్టుల్లో నటిస్తూ తన కెరీర్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073